# పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- యుద్ధ ప్రాతిపదికన
- కాలువల పనులు పూర్తి చేస్తాం
- సాగునీటి ప్రాజెక్ట్ లపై
- సమీక్ష చేయనున్న ముఖ్యమంత్రి
- పాలమూరును బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది
- ఒక్క పంపు నడిపి ప్రాజెక్టు
- పూర్తైందనడం హాస్యాస్పదం
- ఏ ముఖం పెట్టుకుని పాదయాత్రలు చేస్తారు
- బీఆర్ఎస్ నాయకుల తీరును
- తప్పుపట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను సందర్శించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

**కొల్లాపూర్,మే 26,ప్రభాతవార్త :** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పిఆర్ఎల్ఐఎస్ ) పనులు 90 శాతం పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వాదనలు పచ్చి అబద్ధాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. కనీస పనులు చేపట్టకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఆ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని పాదయాత్రలు చేస్తారని ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. మంగళవారం నాగర్ కర్నూల్, జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ప్రధాన భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్, ప్యాకేజీ 3, ఏదుల పంప్ హౌస్, రిజర్వాయర్, కుమ్మెర వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును రూ. 80 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించి, రూ. 35 వేల కోట్లు మంజూరు చేసినప్పటికీ, పదేళ్ల కాలంలో ఖర్చు చేసింది కేవలం రూ. 27 వేల కోట్లు మాత్రమేనని మంత్రి వివరించారు. లక్ష కోట్ల రూపాయలతో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టును, కనీసం ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను కూడా నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధికోసం ఆర్భాటంగా ఒక పంపును గంటపాటు నడిపించి చేతులు దులుపుకున్నారని, వాస్తవానికి నార్లాపూర్ వద్ద బిగించాల్సిన తొమ్మిది మోటర్లలో కేవలం మూడింటిని మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం బిగించిందని తెలిపారు. మరో ఐదు మోటర్లను తక్షణమే బిగించాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నికర జలాలను వినియోగంలోకి తెచ్చి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలోని నాలుగు లక్షల అరవై వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు. అయితే ఈ పనులు చేపట్టే క్రమంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఆ సమస్యలను అధిగమిస్తూనే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు ప్రధాన కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ పూర్తి చేసి మొత్తం 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పట్ల కూడా గత ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. ఈ ప్రాజెక్టు కింద ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4 టీఎంసీలే ఉండటం వల్ల 40 వేల ఎకరాలకు మించి నీరందే అవకాశం లేదని, 4.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందాలంటే కనీసం 25 టీఎంసీల సామర్థ్యం ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కానీ బీఆర్ఎస్ పాలకులు ఒక్క రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు, నెట్టెంపాడు, భీమా, కోయిలా సాగర్ వంటి ప్రాజెక్ట్ లకు కూడా సరైన నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, పాలమూరు ప్రాజెక్టులను విస్మరించి ఇతర ప్రాంతాల ప్రాజెక్టులపైనే ఆ ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి విమర్శించారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి వచ్చే వారంలో జిల్లాలో పర్యటించి ప్రాజెక్టుల పరిస్థితులను స్వయంగా సమీక్షిస్తారని మంత్రి తెలిపారు.మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా అచ్చంపేట, వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని చివరి ఆయకట్టు వరకు నీరందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఉద్ఘాటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 4.60 లక్షల ఎకరాలకు 4,600 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు ఎల్లూరు, సింగోటం, గుడిపల్లి వరకు మట్టికట్టలను సరిచేయాల్సి ఉందని ఆయన చెప్పారు. రైతాంగానికి నీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారాలు చూపుతామని, పాలమూరు రంగారెడ్డి ప్యాకేజీ3 పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు.



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# మైనారిటీ సంక్షేమానికి మరో అడుగు

- విద్యా ఉపాధిపై ప్రత్యేక దృష్టి
- విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- రూ.50 లక్షలతో నిర్మించిన
- అహెలే హద్దీస్ ఈద్గా ప్రహరీ ప్రారంభం



ఈద్గా ముఖద్వారాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, మే 26 ప్రభాతవార్త :** మైనారిటీ సంక్షేమ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన అహెలేహద్దీస్ ప్రహరీగోడను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి, వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల మెరుగుదల కోసం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం మైనారిటీలకు విద్య, ఉపాధి, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. అహెలే హద్దీస్ ఈద్గా అభివృద్ధి కోసం నిర్మించిన ఈ ప్రహరీ గోడ రంజాన్ బక్రీద్ పర్వదినాల సందర్భంగా చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని అమలు చేయడంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఇంకా అద్భుతంగా ఈద్గాను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని, ఈద్గాను లేవలింగ్ చేసి, మహిళల కోసం ఒక షెడ్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సాధించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు.ప్రజాసంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ, పేద కుటుంబాలకు తక్కువ ధరలో నిత్యావసర వస్తువులు అందించే సూపర్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మహబూబ్ నగర్‌లో హిందూ, ముస్లిం, క్రైస్తవులు అన్ని మతాల ప్రజలు సోదరభావంతో కలిసి జీవించడం మన సంప్రదాయమన్నారు.ఎలాంటి సమస్యలైనశాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన చెప్పారు.ప్రతి నియోజకవర్గంలో -మిగతా4లో..



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

**దామరగిద్ద, మే 26 ప్రభాతవార్త:** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజులకార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీసే సామా జిక సమస్య అని పేర్కొన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం, హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. సమాజంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి బాల్య వివాహాలను అరికట్టడంలో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, తహసిల్దార్ తిరుపతయ్య, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మండల యువజన అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, మహిళలు, యువతతో పాటు కంసాన్‌పల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

## మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**అచ్చంపేట, మే, 26 ప్రభాతవార్త:** మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలో అంగిరేకుల శేఖరయ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమపథకాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆలోచనతో ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకులు, ఇందిరా మహిళాశక్తి ఆర్టీసీబస్సులు,శ్రీనిధి ద్వారా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించి మహిళ అభ్యున్నతి సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని సూచించారు. రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేయడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మున్సిపల్ కమిషనర్ మురళి, రామనాథం గోపాల్ రెడ్డి ఖాదర్ బాషా కటకం రఘురాం మేరు శ్రీనివాసులు, శారదమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# రాబందుల రాజ్యం మనకొద్దు

- ఆదాని,అంబానీ లాంటి రాబందులను
- ప్రోత్సహిస్తున్న మోడీ ప్రభుత్వం
- నిరుపేదలను నిలువు
- ముంచుతోంది బిజెపి సర్కార్
- పెట్రోల్ డీజిల్ ధరల
- పెంపుపై ఎడ్ల బండ్లతో ర్యాలీ



ఎడ్లబండ్లపై ర్యాలీతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మెగా రెడ్డి శివసేన రెడ్డి

**వనపర్తి, మే 26,ప్రభాతవార్త:** ఇంధన పెంపుదలను నిరసిస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో చేపట్టిన ఎద్దుల బండ్ల నిరసన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ కేంద్ర బిజెపి సర్కార్ మొదటి భోగీలో మోదీ రెండో భోగీలో ఆదాని అంబానీ లాంటి వారు ప్రయాణిస్తూ దేశాన్ని రాబందుల పిక్కుతింటున్నా రని ఈ డబల్ ఇంజన్ సర్కారుకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి,శివసేనరెడ్డిలు వనపర్తిలో ఎద్దుల బండ్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఇంధనంపై పెంచిన రేట్లు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ప్రధాని గంటలు మోగిస్తే చప్పట్లు కొట్టినంత మాత్రాన నిరుపేదల సమస్యలు తీరవని,ప్రజలకు అధిక భారం లేకుండా చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అధిక ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు.భారతీయ జనతా పార్టీ నాయకులు వనపర్తిలో ధర్నాలు చేయడం సరికాదని బాధ్యతయుతంగా వ్యవహరించి మోడీ ఇంటి ముందల ధర్నాలు చేసి రాష్ట్రానికి ఏదైనా మేలు చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు. మాయమాటలు చెప్పే అధికారులకు వచ్చిన మోడీ సర్కార్ ఇప్పటికే మూడు పర్యాయాలు ఏడున్నర రూపాయలను పెట్రోల్ డీజిల్ పై పెంచిందని పేర్కొన్నారు. మోడీ సర్కార్ ఇంధనం ధరలను వెంటనే తగ్గించకపోతే జిల్లా మండల గ్రామస్థాయిలోని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి మెడలు వంచాల్సి వస్తుంది అన్నారు. బిఆర్ఎస్ బిజెపి పార్టీలు మంచి దోస్తాన్ మైంటైన్ చేస్తున్నాయని వారి కార్యకలాపాలు నిరసిస్తూ మనం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలోని 19 రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వమే ఉందని మరి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదంటూ నిలదీశారు. వడ్ల కొనుగోలు నీతులు చెప్పే నాయకులు వడ్ల కష్టాలు పెంచడానికి మీరు పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలు వాస్తవం కాదా అన్నారు. ఎఫ్‌సిఐ గోదాములకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోగా పైపెచ్చు ఇలాంటి మాటలు మాట్లాడడం సరికాదన్నారు.వారి నిరంకుష పాలనను నిరసిస్తూ అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి నరేంద్ర మోడీ సర్కారును ముట్టడించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి అనే ఇంజన్ ప్రభుత్వాన్ని కొనసాగిస్తుందని రానున్న రోజుల్లో కేంద్రంలోనూ రాహుల్ గాంధీ మరో ఇంజన్ గా మారతారని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, వనపర్తి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ చౌరస్తాలో రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

# డయల్ యువర్ ఎస్పీకి విశేష స్పందన

## ప్రజల నుంచి 18 ఫిర్యాదులు



జిల్లా ఎస్పీ డా.వినీత్

**నారాయణ పేట, మే 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని ఎస్పీ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీకి ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. మొత్తం 18 ఫోన్ కాల్స్ అందినట్లు తెలిపారు ఈ సందర్భంగా బెల్ట్ షాపులు, భూ తగాదాలు, ఆరుబయట మద్యం సేవించడం, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంపు, డబ్బులు తీసుకుని మోసం చేసే ఘటనలు తదితర సమస్యలను ప్రజలు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని ఫిర్యాదులను స్వయంగా నమోదు చేసుకున్న ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల పక్షానే పనిచేస్తుందని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సర్వేయర్



ఎసిబికి పట్టుబడ్డ సర్వేయర్ బ్రహ్మయ్య

**వడ్డేపల్లి, మే 26 ప్రభాతవార్త :** భూములకు సంబంధించి ఒక రైతుకు అనుకూలంగా సర్వే చేయడానికి లంచం డిమాండ్ చేసిన గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య మంగళవారం ఏసీబీ అధికారుల దాడిలో అడ్డంగా బుక్కయ్యారు. మండలంలోని ఒక రైతుకు సంబంధించిన మొత్తం నాలుగు ఎకరాల పొలాన్ని సర్వే చేయడానికి ఎకరాకు రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 20,000 ఇవ్వాలని సర్వేయర్ బ్రహ్మయ్య సదరు రైతుపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇందులో భాగంగా రైతు నుంచి గతంలోనే అడ్వాన్సుగా రూ. 5,000లు తీసుకున్నారు. మిగిలిన పూర్తి డబ్బులు ఇస్తేనే పొలం సర్వే చేస్తానని, లేదంటే కుదరదని సర్వేయర్ మొండికేయడంతో విసిగిపోయిన బాధిత రైతు మహబూబ్ నగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ సారథ్యంలో ఏసీబీ బృందం పక్కా ప్రణాళికతో వడ్డేపల్లిలో నిఘా పెట్టింది. రైతు నుంచి సర్వేయర్ బ్రహ్మయ్య రూ. 10,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రసాయన పరీక్షలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

# ఆస్తి ఇచ్చినా .. అంత్యక్రియలకు రాలే..

- పొలం తన పేర
- చేయించుకుని పట్టించుకోలే..
- తల్లిని కడసారి చూడడానికి రాని కొడుకు..
- అన్ని తామై అంత్యక్రియలు జరిపిన బిడ్డలు..
- మహబూబ్‌నగర్ జిల్లా
- భూత్పూర్ మండలంలో ఘటన



కొమ్ము చంద్రమ్మ (ఫైల్)



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతుళ్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో / భూత్పూర్, మే 26 ప్రభాతవార్త:** కన్నతల్లిని కడసారి కూడా చూడ డానికి ఆ కొడుకు రాలేదు.. తల్లి పేరు మీద ఉన్న పొలాన్ని తన పేరు చేయించుకు న్నాడు.. అయినా అమ్మ మీద కనీసం జాలి కలగలేదు.. అమ్మ ఇక లేదు అన్న విషయాన్ని రక్తం పంచు కుని పుట్టిన తోబుట్టువులు చెప్పినా కడసారి చూపుకు కూడా నోచుకోలేదు.. ఇక చేసేదేమీ లేక కన్న బిడ్డలే అంత్యక్రియల తంతు చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో చోటు చేసుకున్నది. కొమ్ము చంద్రమ్మ, కొమ్ము జంగయ్య దంపతులు నాగర్‌కర్నూల్ జిల్లా పోతిరెడ్డిపల్లి వాసులు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె నిమ్మల అన్నపూర్ణమ్మ, ఒక కుమారుడు కొమ్ము మల్లేష్, చిన్న కుమార్తె డి.వసంత ఉన్నారు. 14 ఏళ్ల కిందటే ఇంటి పెద్ద కొమ్ము జంగయ్య మరణించాడు. తదనంతరం చంద్రమ్మ తాను జీవితాంతం కష్టపడి, ఆస్తిని పోగుచేసి తన సంతానానికి అందజేయాలని కోరుకున్నది. ఈ క్రమంలో తన పేరా ఉన్న 12 ఎకరాల పొలంలో బిడ్డల పేరు మీద ఒక్కో ఎకరా చొప్పున రిజిస్ట్రేషన్ చేసి, 9 ఎకరాల పొలాన్ని తన కుమారుడు కొమ్ము మల్లేష్ పేరు మీద చేసింది. ఇంత చేసిన కుమారుడు కోడలు నుంచి తన బాధలు తప్పలేదు. తనను వేధిస్తున్నారంటూ ఇప్పటికే తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు అయినట్లు సమాచారం. తన కుమారుడు పట్టించుకోకపోవడంతో గత కొంతకాలంగా భూత్పూర్ లో నివాసం ఉంటున్నది. కుమారుడు పట్టించుకోకపోవడంతో అన్ని తామై బిడ్డలే చూసుకుంటున్నారు. చేదోడు వాదోడుగా ఉంటూ అవసరమైనప్పుడల్లా వైద్య సేవలు కూడా అందిస్తూ వచ్చారు. తల్లి అనారోగ్యం పాలైన కూడా ఏ ఒక్కరోజు వచ్చి చూసిన పాపాన పోలేదని బిడ్డలు ఆరోపిస్తున్నారు. ఆస్తిని పొంది కూడా కనీసం తల్లి బాగోగులు చూడలేదని స్థానికులు చెబుతున్నారు.

### అంతిమయాత్రకు రాలే..

చంద్రమ్మ సోమవారం ఉదయం నాలుగు గంటలకు తనువు చాలించింది. విషయం తెలుసుకున్న కుమార్తెలు అంతిమ యాత్ర తంతును వారే కొనసాగించారు. పెద్ద కుమార్తె అన్నపూర్ణమ్మ భూత్పూర్ రెండో వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. ఆమెనేముందు నడిచి కార్యక్రమం అంతా పూర్తి చేశారు. ఆస్తి తగాదాలతో కన్న తల్లిదండ్రులకు కొరివిపెట్టని కొడుకులను చూసాం కానీ ఆస్తిలో భాగం తీసుకొని కూడా కనీసం అంతిమ యాత్రకు కూడా రాలేదని, కన్నతల్లిని కడసారి చూడడానికి కూడా రాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని తాము ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి, గోదాములకు తక్షణమే తరలించాలి

**వీపనగండ్ల మే 26 ,ప్రభాతవార్త :** వీపనగండ్ల మండలంలోని వరి కొనుగోలు, ధాన్యాన్ని గోదాములకు తరలించడంలో అధికారుల నిర్లక్ష్యని కి నిరసనగా కార్యాలయం ముందు సిపిఎం పార్టీ నేతలు,రైతులు మంగళవారం నాడు ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ మండల



రైతుల సమస్యపై తాసిల్దార్ కు మెమొరాండం అందిస్తున్న దృశ్యం

కార్యదర్శి డి.బాల్‌రెడ్డి మాట్లాడుతూ. పండించిన పంటను రైతు చేతికి తెచ్చుకుంటే ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ రైతు యొక్క ధాన్యాన్ని కొనుగోలు చేయకుండగోదాములకు తరలించకుండా పూర్తిగా రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అనేకసార్లు పై అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా ఉందన్నారు.తరుగు పేరుతో రైతులను మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకొని అక్రమాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసిల్దారు ఖాజా మైనుద్దీన్ అందించడం జరిగింది. ఈకార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సి.హెచ్. వెంకటయ్య, నక్క ఈశ్వర్, ఎం.ఆది,వెంకటేశ్వర్‌గౌడ్, రామకృష్ణ,నవీన్ రైతులు రాముడు, వేమన,నారాయణరెడ్డి, కృష్ణయ్య, గోవిందు రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీ మృతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ఆత్మకూర్ మే26, ప్రభాతవార్త:** గతవారంరోజులుగా వనపర్తిజిల్లాలో ఉపాధిహామీపథకం కూలీలు మృతి చెందిన ఘటన మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అంతేకాకుండా ఉపాధి పనుల్లో భాగంగా మృతి చెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు అజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రోజు ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాలలో ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం మూలంగానే కూలీలు ప్రమాదవశాత్తు మృతి చెందడం జరిగిందని అందుకు బాధ్యత వహిస్తూ అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటుగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు మంజూరీ చేయాలని మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలలో కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీల ముడతల కుటుంబాలకు అండగా నిలవాలని లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కార్మికులు హక్కుల కోసం ఉద్యమించాలి....

**ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వెల్లడి....**

**ఆత్మకూర్ మే 26, ప్రభాతవార్త :** దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కొత్తగా నాలుగు లేబర్ కోర్ల తెచ్చిన విషయాన్ని కార్మికులు గుర్తించి కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐటీయూసీ వనపర్తి జిల్లా అధ్యక్షులు శ్రీహరి పిలుపునిచ్చారు. మంగళవారం రోజు ఆత్మకూరు మండలం



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే నిర్వహిస్తున్న దృశ్యం

లోని జూరాల గ్రామంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10గంటల తగ్గింపును కోరుతూ కార్మికుల రక్తంతో చెందిన ఎర్ర జెండా సాక్షిగా కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం పని గంటలు పెంచుకునేందుకు కార్మిక యాజమాన్లకు వెసులుబాటు కల్పిస్తూ లేబర్ కోడాద రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలను సవరిస్తామంటూ ప్రగల్బాలు పలుకుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అసంఘటితరంగా కార్మికులకు తీరని అన్యాయం చేసే విధంగా వేతన సవరణలు చేపట్టడం క్షమించరాని విషయమని ఆయన అన్నారు. అంతకుముందుగా జూరాల గ్రామ సిపిఐ నాయకులు బాలకృష్ణ మే డే సందర్భంగా జెండా ఆవిష్కరించగా ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల సిపిఐ కార్యదర్శి లక్ష్మీనారాయణ శెట్టి, సిపిఐ నాయకులు మోష, పూలన్, రాజు వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణమ్మ జలంతో గ్రామ దేవతలకు అభిషేకం

**కృష్ణ,మే 26 ప్రభాతవార్త :** గుడేబల్లూర్ గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలకు ఘనంగా హిందూ సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఈ గ్రామంలో ఐదు మేటీలుగా ఉన్న వారిలో గ్రామ పెద్దలు మూడు రోజులు ముందుగానే ఈ పండుగకు ఏర్పాట్లు చేస్తారు. ప్రతి ఏటా ఈ ప్రాంత ప్రజలు కృష్ణా నదికి వెళ్లి గంద్రు గొడ్డళ్లకు ,



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

తల్వార్లకు నిమ్మకాయలను అమర్చి కృష్ణా నది జలాన్ని బిందెల్లో సేకరించి పూజలు చేస్తారు. అనంతరం గ్రామదేవతలకు పూజారులుగా ఉన్న వాకిటి వారు బిందెల్లో సేకరించిన కృష్ణా జలాన్ని గ్రామానికి మోసుకు వస్తారు. తదనంతరం గ్రామదేవతలైన ఊర మారెమ్మ, లక్ష్మమ్మ, బీట్లె మైసమ్మ, సౌరమ్మ, గట్టు మారెమ్మలకు హిందూ సాంప్రదాయంలో పూజలు నిర్వహించి కృష్ణ జలంతో అమ్మవార్లకు అభిషేకం చేస్తారు. ప్రతి యేటా ఈ ప్రాంతీయ సాంప్రదాయ పండుగను మొలకల పౌర్ణమికి ముందు నిర్వహించి ముక్కులు తీర్చుకోవడం వల్ల గ్రామానికి రక్షణ కవచంలా ఉన్న గ్రామ దేవతల ఆశీర్వాదం ఎల్లప్పుడూ తమపై ఉండి పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు.

## గోవుల అక్రమ రవాణాకు కఠిన చర్యలు తీసుకోవాలి

**నారాయణ పేట, మే 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఊట్కూర్ గ్రామంలో గోవుల అక్రమ రవాణా, గోహత్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని హిందూవాహిని మండల శాఖ పోలీస్ అధికారులను కోరింది. పాడి పశువులను రక్షిస్తూ గోహత్యలను పూర్తిగా నిరోధించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా హిందూవాహిని మండల నాయకులు మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాను అరికట్టేం



వినతి పత్రం సమర్పిస్తున్న హిందూవాహిని సభ్యులు

దుకు కీలక ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, చట్టపరంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో హిందూవాహిని మండల అధ్యక్షుడు జేకే అరుణ్‌తోపాటు వినోద్, శివ, వంశీ, మహేష్, భరత్, బోయిని రవి, బాలు తదితరులు పాల్గొన్నారు.

## తపస్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి టాపర్లకు ఘన సన్మానం

**నారాయణపేట,మే26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఊట్కూర్ గ్రామంలో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యం



లో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2026 ఎస్ఎస్‌సి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతి పాఠశాల టాపర్లతో పాటు వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి మాధవి, గ్రామ సర్పంచ్ రేణుక భరత్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత మార్కులు సాధించి మండలానికి జిల్లాలో మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కో కన్వీనర్ గుంపు బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు నరసింహా, మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ తపస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

**- మహిళ సంఘాల బలోపేతం కోసం వడ్డీ లేని రుణాలు మంజూరు : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ**

**కల్వకుర్తి, మే 26 ప్రభాతవార్త:** మహిళా సాధికారతతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారన్నారు. కల్వకుర్తి పట్టణంలోని కేబిఎన్ ఫంక్షన్ హాల్ లో మున్సిపాలిటి పరిధిలోని మహిళ సంఘం సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99లో బాగంగా మంగళవారం మహిళ ఉత్సవాల సందర్భంగా చీరల పంపిణీ



మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మంచి నాణ్యమైన చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు అందించారని, ఇక నుంచి అందరు మహిళలు చీరలు ధరించి ప్రభుత్వ పథకాల కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు. మహిళా ఆరోగ్య, అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు, పథకాల్లో వారికే ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, మున్సిపాలిటి చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కమిషనర్ షేక్ మహమ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, పుస్తకాల రాహుల్, రమాకాంత్ రెడ్డి, కౌన్సిలర్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, మహిళా సంఘల సభ్యులు, మహిళల కాంగ్రెస్ నాయకులు వివిధ మండలాల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హక్కుల కోసం టిఆర్ఎస్ మహా ధర్నా..

## విద్యాసంస్థల పునరుద్ధరణకు డిమాండ్

**నారాయణ పేట, మే 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా హక్కుల సాధన కోసం తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా నుంచి వెనక్కి తరలించిన ప్రభుత్వ విద్యాసంస్థలను తిరిగి పేటకు తీసుకురావాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ నాయకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ పార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు వివిధ గ్రామాల నుంచి భారీగా కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించిన అనంతరం కార్యకర్తలు నినాదాలతో ప్రాంతాన్ని హోరెత్తించారు. ధర్నాలో మాట్లాడిన గవినోళ్ల శ్రీనివాస్, జిల్లా నుంచి వెనక్కి వెళ్లిన ప్రభుత్వ విద్యాసంస్థలను వెంటనే నారాయణపేటకు తీసుకువచ్చి తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన ప్రభుత్వ ఆసుపత్రిని అందుబాటులోకి తేవడం,ఎస్పీ కార్యాలయ నిర్మాణాన్ని వేగవంతం చేయడం, రైతులకు రైతు భరోసా నిధులు జమ చేయడం, పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు. అలాగే పంచాయతీరాజ్ ఎస్సీ, ఎస్పీ కార్యాలయం, దేవా



తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించిన నాయకులు

దాయశాఖకార్యాలయాలను నారాయణపేటజిల్లా కేంద్రంలో ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా పరిపాలనా అధికారికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలీసెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

**కొల్లాపూర్,మే 26, ప్రభాతవార్త :** కొల్లాపూర్ పట్టణంలోని బ్రైట్ మైండ్స్ అకాడమీ ప్రతియేట నిర్వహించే పాలీసెట్ కోచింగ్‌లో భాగంగా గత విద్యా సంవత్సరం మాదిరిగానే,ఈ విద్యా సంవత్సరం నిర్వహించిన పాలీసెట్ పరీక్షలో అకాడమీ విద్యార్థులు అద్భుత ఉత్తీర్ణతను సాధించారు.ఈసందర్భంగా స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఈఓ ఇమ్మానుయేల్,రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కొండూరు గ్రామ సర్పంచ్ కేతూరి ధర్మతేజ లు విద్యార్థులను అభినందించి సన్మానించారు. ఈ ఫలితాలలో ఎంబైపీసి విభాగంలో గార్దుల సాయి కృష్ణ 120 మార్కులకు గాను 107.5 మార్కులు సాధించి 563వ ర్యాంకు, ఎంపిసి విభాగంలో 111 మార్కులు సాధించి 695 ర్యాంకు, మీనిగ జయంతి ఎంబైపీసి విభాగంలో 120 మార్కులకు గాను 104.5 సాధించి 826 ర్యాంకు ఎంపిసి విభాగంలో 105 మార్కులు సాధించి 1723 ర్యాంకు రావడం జరిగింది.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో అకాడమీ ఉపాధ్యాయుల నిబద్ధత వల్లే ఈ ఉత్తీర్ణత సాధ్యమైందని భవిష్యత్తులో మరింత మంది విద్యార్థు





విద్యార్థిని శాలువాతో సన్మానిస్తున్న ఎంఇఓ,ఉపాధ్యాయులు

లు ఉన్నత ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో బ్రైట్‌మైండ్స్ అకాడమీ డైరెక్టర్ తోషకాని వెంకటేష్, అధ్యాపకులు జునైద్ పాషా,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదమని తెలిసినా పట్టించుకునేవారు లేరు

**కంసాని పల్లిలో విపత్తు పట్ల పట్టించుకోని అధికారులు**

**ఉప్పునుంతల, మే 26 ప్రభాతవార్త:** గత గురువారం సాయంత్రం జరిగిన విపత్తుతో కంసాని పల్లిలో నెలకొన్న విపత్తు పట్ల నేటికీ ప్రజలు కోల్కోకపోవడం విడ్డూరంగా ఉంది. గ్రామంలో ఇంత విపత్తు నెలకొన్నప్పటికీ పంచాయతీరాజ్ అధికారులు అడ్రస్ లేకుండా పోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు వాపోతున్నారు. గత ఆరు రోజుల నుంచి గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో తాగునీరు లేక ప్రజలు తల్లడిల్లుతున్న స్థానిక పంచాయతీ అధికారి పూర్తిస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో విద్యుత్ సరఫరా లో నెలకొన్న సమస్య నేటికీ పరిష్కారం కాకపోవడం, తోడుగా తాగునీరు లేక ప్రజలు ఇతరప్రాంతాలకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గ్రామంలో నెలకొన్న విపత్త్ సమయంలో పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.గ్రామంలో పలువీధుల్లో చెట్లు విరిగి నేలకొరిగి ఎప్పుడు ఏం జరుగుతుందో అని ప్రజలు భయాన్ని గుప్పిట్లో పెట్టుకొని కొనసాగుతున్నారు. ప్రమాదమని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం చాలా విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న చెట్లు ఒరిగి ఇండ్లపై పడి ఉండడం వాటిని తొలగించే వారు లేకపోవడం చాలా ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్ని ఇళ్ళ ముందు వేపచెట్లు విరిగి ఇండ్లపై పడి కొట్టుమిట్టాడుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు మరీ బాధాకరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని



కంసానిపల్లి లో చెట్లు విరిగి ఇండ్ల పై పడిన దృశ్యం

గ్రామంలో నెలకొన్న విపత్తు పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు అండగా నిలిచిన పార్టీ శ్రేణులు

**ఉప్పునుంతల, మే 26 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు అండగా నిలిచి తోచిన సహాయం అందించారు. మండల కేంద్రమైన గ్రామానికి చెందిన పార్టీ యువ నాయకుడు నడిగడ్డ యాదగిరి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని హస్తినపూర్ వెల్ నెస్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న యాదగిరి కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు అండగా నిలిచారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. పార్టీ శ్రేణులు రూ.53 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో మర్రిపల్లి గ్రామ సర్పంచు, మాజీ డిసిసిబి డైరెక్టర్,సంఘ సభ్యులు సత్తు భూపాల్ రావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టగోపాల్ రెడ్డి,న్యాయవాది మేడమోని కృష్ణయ్య, ఆలూరు పర్వతాలు ( కోళ్ల మల్లయ్య), మాజీ ఉమామహేశ్వర దేవస్థానం కమిటీ డైరెక్టర్ సి.హెచ్ సుధాకర్, మేడమోని తిరుపతయ్య, అంతటి నిరంజన్ గౌడ్, బిఆర్ ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మెడమోని



ఆర్థిక సహాయం అందజేస్తున్న పార్టీ శ్రేణులు

శ్రీనివాసులు,ఎల్లయ్య యాదవ్, చిన్న జంగయ్య, బర్ల బాలస్వామి, సతీష్‌రెడ్డి,కురుమయ్య,బొల్లిమహేష్, తాండ్ర శేఖర్, సిహెచ్ రాజు, బాలకృష్ణ,బింగి పర్వతాలు, మేడమోనీ రాము, ఆలూరు వెంకటేష్, బాల గౌడ్ తదితరులు అండగా నిలిచారు.బిఆర్ఎస్ నాయకులు పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం పట్ల గ్రామస్తులు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## వరి కొయ్యాలను కాల్చవద్దు

**మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్**

**ఉప్పునుంతల,మే 26 ప్రభాతవార్త :** వాన కాలంలో సాగుకు భూములను సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలను కాల్చవద్దని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ రైతులకు సూచించారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల భూసారం నష్టంతో పాటు వాయు కాలుష్యం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దీంతో కొన్నిసార్లు ప్రాణ నష్టం జరిగే అవకాశం అధికంగా ఉంటుందని అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాల బహిరంగ దాహనాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు.

## కేంద్రం పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి

**సిపిఎం మండల కార్యదర్శి మ్యాతరి వెంకట్ రాములు**

**మదనాపురం, మే 26 ప్రభాతవార్త :** పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని సిపిఎం మండల కార్య దర్శి మ్యాతరి వెంకట్రాములు డిమాండ్ చేశారు. మదనాపురం మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ ముడి చమురు ధరలతో పాటు నిత్యవసర వస్తువుల



ధరలు కూడా పెరగడం పట్ల ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఎన్నికల సమయా లు వచ్చేసరికి మాత్రమే ప్రభుత్వాలు వైభవం చేయడం సరికా దన్నారు. పెంచిన ధరలను తగ్గిస్తూ ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు.

## వివోఎల నిరవధిక సమ్మె



నిరవధిక సమ్మెలో వివోఎలు

**శ్రీరంగాపూర్,మే 26 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రం నందు మంగళవారం ఐకెపి, వివోఎల రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు నిరవధిక సమ్మెను చేయడం జరిగింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివోఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేయడం జరిగింది.వివోఏలకు ప్రస్తుతం పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా నెలకు రూ. 25 వేలను చెల్లించాలని ఆరోగ్య భద్రత కల్పిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేకల శ్రీనివాసులు, గోవిందమ, వినోద, కవిత, ఎల్లస్వామి, మహేశ్వరి, శిరీష తదితరులు పాల్గొనడం జరిగింది.

## గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ రాజు మృతి

**పెద్దమందడి, మే 26 ప్రభాతవార్త :** పెద్దమందడి మండల రెవెన్యూ అధికారి ఎమ్మార్వో కార్యాలయంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న రాజు మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూశారు. రాజు సహాయక స్వభావం చిరునవ్వుతో అందరినీ ఆదరించే తీరుకు స్థానిక



అసిస్టెంట్ రాజు ( ఫైల్)

ప్రజలు కార్యాలయ సిబ్బందిలో మంచి గుర్తింపు పొందారు. తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని అతి స్నేహపూర్వకంగా పలకరించడం వారి సమస్యలు ఓపికగా పనిచేయడం వారి సమస్యలు ఓపికగా విని సాయం అందించడంలో ఆయ న ఎప్పుడూ ముందుండేవారు. క్లిష్టమైన పనుల్ని కూడా బాధ్య తలు నిర్వహించి సహోద్యోగుల ప్రశంసలు పొందారు. ఆయన ఆకస్మిక మరణ వార్త తెలియగానే కార్యాలయ సిబ్బంది స్థానిక ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎప్పుడూ చురుకుగా అం దుబాటులో ఉండే రాజు మృతి కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులను విషాదంలో ముంచెత్తి రాజు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ పలువురు ఆయన సేవలను స్మరించు కుంటూ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## వనపర్తి డిపోను సందర్శించిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

**రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దార సుందర్**



రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న వనపర్తి డిపో సంఘం నాయకులు

**వనపర్తి, మే 26, ప్రభాతవార్త:** ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దార సుందర్ వనపర్తి డిపోను సందర్శించారు ఈ మేరకు సంఘం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. నూతనంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన దార సుందర్. రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ హనుమంతు నాయక్ ను డిపో నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ ను కలిసి సంఘం సభ్యుల సమస్యల విషయంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి గంధం జాన్ రాజ్, అధ్యక్షులు వెంకటయ్య, తిరుపతి నాయక్, అడివయ్యా, రాముడు, ఎంసి సింగ్, రమేష్, విమలమ్మ,రేణుక జి.రాముడు అధికారులు పాల్గొన్నారు.



## సబ్సిడీ జీలుగా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి**

**గండీడ్ మే 26, ప్రభాతవార్త;** ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం గండీడ్ మండల కేంద్రంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్ మండలం సర్పంచుల సంఘం అధ్యక్షులు భగవంతు రెడ్డితో కలిసి జీలుగా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ విధానంలో భూసారం పెంచడం కోసం జీలుగా పంటలను సాగు చేసుకోవడం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వరి, నూనె గింజల పంటలు, ఉద్యాన పంటల సాగుకు ముందు జీలుగా పంటను సాగు చేసి పూత వచ్చే వరకు పెంచి భూమిలో కలియ దున్నడం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన పంట అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి,పుల్లారెడ్డి, అంచన్ పల్లి సర్పంచ్ చెన్నారెడ్డి, సుదర్శన్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,ఆశిరెడ్డి, రమేష్ ,పులిందర్ రెడ్డి,వెంకన్న గౌడ్, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు వరలక్ష్మీ ,సమత,శివలీల, రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి

**ఐసిడిఎస్ అధికారులు వెల్లడి**

**ఉప్పునుంతల,మే 26 ప్రభాతవార్త :** నేటికీ గ్రామాలలో బాల్య వివాహాలు కొనసాగుతున్నాయని వాటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి పాషా, పావనిలు సూచించారు. మండలంలో మహిళా వారోత్సవాలు జరుపుతున్న సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీఆవరణలో ఏర్పాటుచేసిన అవగాహనసదస్సులో పాల్గొన్న ప్రతిఒక్కరికి అవగాహన కల్పించారు. 18సంవత్సరాల దాటిన తర్వాత అమ్మాయికి, 21సంవత్సరాలునిండిన తర్వాత అబ్బాయిలకు పెళ్లిళ్ల నిర్వహించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో ఎట్టిపరిస్థితుల్లో బాల్యవివాహాలుజరగకుండా గ్రామస్తులు అవగాహన కల్పిస్తూ చైతన్యపరచాలని అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో గ్రామస్తులు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఆరోగ్యకర కుటుంబాల స్థాపనకు కృషి చేద్దాం

**వీపనగండ్ల మే 26, ప్రభాతవార్త;** ఆరోగ్య కుటుంబాల కోసం మనమంతా కృషి చేద్దాం అని ఐసిడిఎస్ అధికారి షేక్ సన్ హేర అన్నారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని తీసుకోవడంవల్ల ఆరోగ్యవంతమైన కుటుంబాలను తయారు చేయగలుగు తామని ఐసిడిఎస్ అధికారి షేక్ సన్ హేర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రతినిత్యం తీసుకునే ఆహారంలో రోగ నిరోధక శక్తిని పెంచే ఆకుకూరలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు తీసుకోవడంతోపాటు శరీరానికి హాని చేసే చక్కెర అధిక, నూనె ,ఉప్పు, జంక్ ఫుడ్ ను తగ్గించుకోవాలని ఆమె కోరారు. బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందివాలన్నారు. పసి పిల్లలను చెడు అలవాట్లకు దూరం చేసినప్పుడే ఆరోగ్యకరమైన కుటుంబాలు తయారవుతాయని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ మహిళా సమైక్య. వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఈ డిఏఓ ప్రభాకర్, ఏపిఎం మద్దిలేటి సూపర్వైజర్ సోనీమండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, పలువురు వైద్య సిబ్బంది మహిళా వారోత్సవాల్లో పాల్గొన్న సిడిపిఓ సోనీ, అంగన్వాడి ఉపాధ్యాయులు ఎల్లమ్మ, సుగుణబాయి, సువర్ణ, తదితర మహిళలు ఉద్యోగులు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడి వెలుగు అధికారులు

## ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**ఉప్పునుంతల,మే26 ప్రభాతవార్త :** స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) రాష్ట్ర తృతీయ సమావేశం ఆదివారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడ రాష్ట్ర అధ్యక్షులు సదానందగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పోకల సతీష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.గజేందర్, పూర్వ అధ్యక్షులు పర్వత రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సాబీర్ అలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పోకల సతీష్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నియామకం చేయడం పట్ల నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్‌రావు, ప్రధానకార్యదర్శి మధుసూదన్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు మామిళ్ళ సుదర్శన్, మురళి, రాష్ట్ర బాధ్యులు రవిశేఖర్, రమేష్, అనిల్ కుమార్ రెడ్డి, ప్రభాకర్, రఘురాం రెడ్డి, సంఘ ప్రతినిధులు లక్ష్మారావు, గోవు సింగోటం, ఉప్పునుంతల మండల అధ్యక్ష కార్యదర్శులు కపిలవాయి విష్ణు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ఎస్టీయు రాష్ట్ర కార్యవర్గానికి వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పీఎం శ్రీ ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పోగుల సతీష్ మాట్లాడుతూ సంఘ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ నిర్మాణానికి తన వంతు చేస్తానని హామీ ఇచ్చారు.



పోకల సతీష్

## మంత్రి శ్రీహరిని అగౌరవపరచడం తగదు

**నారాయణపేట, మే 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని తోటి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సాక్షిగా అగౌరవపరచడం సరికాదని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాకిటి శ్రీహరి మంత్రి పదవిలో ఉన్నప్పటికీ ఎక్కడా గొప్పలకు పోకుండా, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని వెళ్లే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని ఆయన తెలిపారు. రాష్ట్రంలో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, అవి పరిష్కారమయ్యే వరకు పట్టుదలతో పని చేసే నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. ఇలాంటి నాయకుడి పట్ల ఈ విధంగా వ్యవహరించడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని తెలిపారు. వెంటనే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పెద్దలు శ్రీహరికి జరిగిన అవమానానికి తగిన పరిష్కారం కనుగొని తెలంగాణ సమాజానికి వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. లేకపోతే భవిష్యత్తులో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్. నర్సింహా పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను వెంటనే పూర్తి చేయాలి

**ఎంపీడీవో జయరాం నాయక్**

**నవాబుపేట, మే 26 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులు త్వరగా పూర్తి చేయాలని జూన్ 2 నుండి రెండవ విడత లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేయబడతాయని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు సద్వినియోగం చేసుకొని సకాలంలో పూర్తిచేయాలని మండల అధికారి ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు. మంగళవారం మండలం లోని నవాబుపేట బట్టోనిపల్లి తండాను సందర్శించిన ఆయన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదా రులకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను సద్వినియోగపరుచుకొని సకాలంలో ఇండ్లను పూర్తి చేయాలని లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయబడుతున్నాయని, ఇంటి నిర్మాణాలు పెండింగ్ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం నవాబుపేట బటోనిపల్లి తాండ గ్రా మంలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరుగుతున్న ప్రదేశం సందర్శించి ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. ప్రతీ రోజూ కూలీలు అందరూ హాజరు కావాలని, ప్రతీ కుంటుంబం 100 రోజులు పని పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జ్యోతితో పాటు గ్రామ సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయరాం నాయక్

## పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి ఎంతో ఆసరా

**-80 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి, మే 26 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి ౹ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కల్వకుర్తి డివిజన్ పరిధిలోని వెల్దండ మండలానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి ౹ చెక్కులను మంగళ వారం కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల తహసిల్దార్ కార్తీక్ కుమార్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు



చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

## కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేద్దాం

**పెద్దాయపల్లి సర్పంచ్ బి. గాయత్రి లక్ష్మయ్య**

**బాలానగర్, మే 26 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి గ్రామ సర్పంచ్ బి. గాయత్రి లక్ష్మయ్య మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తనపై గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు అభివృద్ధి పనులకు తీర్మానం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంలో తనది ఎలాంటి తప్పు లేదని, గ్రామ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఖాతాలో రూ.24 లక్షల ముడా నిధులు ఉన్నాయని, వాటితో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు పరస్పర సమన్వయంతో పని చేస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులకు తాను తీర్మానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే అధికార పార్టీ నాయకులు తామే రూ.24 లక్షల పనులు చేయాలని పట్టుబట్టడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమతో సమన్వయం చేసుకుని గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం చుడితే తాను ఎల్లప్పుడూ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఇతర కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే ప్రజాస్వామ్యంగా ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు తమపై నమ్మకం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు రాజకీయాలకు అతీతంగా స్పందించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బి. గాయత్రి

## నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ సమస్య పరిష్కారం

**కల్వకుర్తి, మే 26 ప్రభాతవార్త:** నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ సమస్య పరిష్కారమైందని గ్రామ సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరి రవిగౌడ్ పేర్కొన్నారు. గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సమస్యతో గ్రామస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారని, చిన్నపాటి గాలి, వర్షం వచ్చిన విద్యుత్ సరఫరా ఉండేది కాదని పేర్కొన్నారు. జిల్లెల్ల గ్రామానికి పక్కన ఉన్న గ్రామాలకు కలిపి ఒక్కలైన్ తోనే విద్యుత్ సరఫరా కావడంతో గ్రామాలకు కలిపి ఒకే లైన్ ఉండడంతో గ్రామంలో లోఓల్టెజ్ సమస్య కూడా ఉండేదని దీంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో సమస్య పరిష్కారమైందన్నారు. గ్రామంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు జిల్లెల్ల రాములు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గ్రామానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ అందించి విద్యుత్ సమస్యలు లేకుండా 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. నూతంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్స్‌ను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మెంబర్ జిల్లెల్ల రాములు, గ్రామ సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరిరవిగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎముక రవి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి గౌడ్, వార్డు సభ్యులు తాడెం మోనిక, మల్లయ్య, గుమ్మకొండ నాగమణి, మహేందర్, డొక్క చెన్నమ్మ జంగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హనుమాన్ దేవాలయ వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి...

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.కళార్చన**

**వనపర్తి, మే 26, ప్రభాతవార్త:** విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి. కళార్చన అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి లోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమ్మర్ క్యాంప్‌లోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, మహానంది ఏఎంఓ., పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, నిరీష ఆర్ట్ టీచర్, ప్రతాప్ రెడ్డి సిఎంఓ, మల్లేష్ స్కూల్ అసిస్టెంట్, బాల సదన్ ఇంచార్జ్ లావణ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జ్



హాజరైన విద్యార్థులు

## తాగునీటికి కటకట..

**కరెంటు లేక అల్లాడుతున్న మూగజీవాలు..**

**పట్టించుకోని విద్యుత్ అధికారులు**

**జడ్చర్ల,మే26, ప్రభాతవార్త :** రెండు రోజుల కిందట కురిసిన పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడి స్తంభాలు నేలకొరిగాయి. అకాల వర్షం, గాలి కారణంగా పోలేపల్లి కావేరమ్మపేట రైతులు వెళ్లే రహదారిపై విద్యుత్ వైర్లు తెగిపోయాయి. మూడు రోజుల నుంచి లైన్ మెన్ , ఏఈ కి ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి కరెంట్ నిలిపి వేశారని మూగజీవాలకు నీళ్ల అందక అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటికి సైతం ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. రైతుల పొలాల మధ్యలో విద్యుత్ వైర్లు కిందికి ఒరిగాయి. గత సంవత్సరం ఇక్కడి పొలాలలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కరెంట్ షాక్కుకు ఒక యువకుడు బలైనట్లు స్థానికులు చెబుతున్నారు. జరిగిన అధికారులు చలనం లేదని ప్రాణాలు పోతేనే స్పందిస్తారా అంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంటు సమస్యను తీర్చాలని కోరుతున్నారు.



విద్యుత్ వైర్లు తెగిపోయిన దృశ్యం



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

## లారీ అసోసియేషన్ ట్రాన్స్‌పోర్ట్ సీజ్



లారీ అసోసియేషన్ సీజ్

**అచ్చంపేట, మే 26 ప్రభాతవార్త:** పట్టణంలో లారీ అసోసియేషన్ ఆఫీసును సీజ్ చేయడం జరిగిందని తహసిల్దార్ సైదులు ఎస్సై సద్దాం హుస్సేన్ తెలిపారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్నలు రవాణా విషయంలో లారీ అసోసియేషన్ వారు ట్రాన్స్పోర్ట్ విషయంలో కొర్రీలు పెట్టడం సరైన విధానం కాదని అన్నారు. అందులో భాగంగానే మంగళవారం అసోసియేషన్ ఆఫీసుకు వెళ్లి వారితో మాట్లాడారు. రవాణా విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లారీలను నడపాలని కోరారు. దానికి వారు డ్రైవర్ల కొరత ఉందని చెప్పడంతో ప్రైవేట్ డ్రైవర్ల ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ వినకపోవడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రైవేట్ పరంగా ఎలాంటి బిల్డింగులు ఉన్న ఎలాంటి ఆఫీసులో ఉన్న ప్రజా అవసరమేరకు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే హక్కు ఉందని వారు తెలిపారు. వారితోపాటు ఆర్ఐ శివకుమార్ సిబ్బంది ఉన్నారు.

## కిశోర బాలికలకు అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నవాబుపేట,మే26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాకర్ల పహాడ్ గ్రామపంచాయతీలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని యుక్త వయసున్న 15 నుంచి 19 సంవత్సరాలు నిండి ఉన్న కిషోర్ బాలికలకు సమ్మర్ స్పెషల్ శారీరిక వ్యాయామం ప్రాముఖ్యతను ఐబీడీపీఎం,రామ్మూర్తి మండల ఐకెపి సిబ్బంది వివరించారు. కిశోర బాలికలు శారీర శ్రమ యొక్క ప్రాధాన్యత గురించి క్రీడలు ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో సహాయపడుతుందని అబ్బాయి లేదా అమ్మాయి అనే తేడా లేకుండా ప్రతి బిడ్డకు ఆడుకునే హక్కు ఉందని ప్రతిరోజు 30 నిమిషాలు శారీరిక శ్రమ కు సమయం కేటాయించాలని అదేవిధంగా బాల్య వివాహాలు నిర్మూలనపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. చదువు పట్ల ఏకగ్రతగా చూయించాలని శారీరకంగా దృఢంగా ఉండాలని సాంస్కృతిక పాటల రూపంలో చూపించడం జరిగింది. కార్యక్రమంలో కాకర్ల పహాడ్ సర్పంచ్ బాలయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పారిజాత,ఏపీఎం,శ్రీహరి అంగన్‌వాడీ టీచర్స్ సిసి. రామాంజనేయులు, వివో ఏలు శ్రీలత, మంజుల, కిషోర్ బాలికలు తదితరులు గ్రామస్తులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు కారు దగ్ధం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన కారు

**వెల్దండ, మే 26 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు మంగళవారం వ్యవసాయ పొలాల పక్కన ఉన్న గ్రామానికి చెందిన కాలే నీరంజన్, కాలే లక్ష్మయ్య, మల్లయ్య, జంగయ్య, పాపయ్య, రాములుకు చెందిన గొర్రెల పాకలతోపాటు దొడ్డిలో ఉన్న నిరంజన్‌కు చెందిన కారుకు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది దొడ్డిలో ఉన్న ఆరుగొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ రమేష్ గౌడ్ వెంటనే ఫైరింజన్‌కు సమాచారమివ్వడంతో సంఘటన స్థలానికి ఫైరింజన్ చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొని రావడంతో నివాసాలకు పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్ఐ యుగేందర్ రెడ్డిలు చేరుకొని పరిస్థితిని గమనించి పూర్తిగా మంటలు చల్లారే వరకు అక్కడే ఉన్నారు. మరే ప్రమాదం చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. పూర్తిగా వ్యవసాయ పనిముట్లు దగ్ధం కావడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం వాటిలిందని రైతులు తెలిపారు. ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకోవాలని సర్పంచ్ రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

## పింఛన్ దరఖాస్తుదారులకు సూచన

**రేవల్లి, మే 26 ప్రభాతవార్త:** రేవల్లి మండలం కేంద్రంలో కొత్త పింఛన్ల కోసం గతంలో దరఖాస్తు చేసిన వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల వ్యవసాయ భూముల పాస్‌బుక్ జిరాక్స్‌లను గ్రామ పంచాయతీలో సమర్పించాలని అధికారులు తెలిపారు. అలాగే వితంతు, వికలాంగుల, వృద్ధాప్య పింఛన్లకు అర్హులైన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని గ్రామ పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

## ఎత్తిపోతల పథకాలకు నిధుల మంజూరు : ఎమ్మెల్యే

**మదనాపురం, మే 26 ప్రభాతవార్త :** మండలంలోని ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేసిం దని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సరళాసాగర్ ఎత్తిపోతల పునరుద్ధరణకు ఒక కోటి 94 లక్షల 20000 కురుమూర్తి రాయ ఎత్తిపోతల పునరుద్ధరణకు ఒక్క కోటి 45 లక్షల 20000 నెల్విడి ఎత్తిపోతల పునరుద్ధరణకు 92 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సాధ్యమైనంత తొందరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వచ్చే వర్షాకాలం నాటికి పనులన్నీ పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందిస్తామని తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్యే జిఎంఆర్

## మైనారిటీ సంక్షేమానికి మరో అడుగు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకువస్తున్నాం అని ఆయన చెప్పారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రారంభమై, త్వరలో మరిన్ని ప్రారంభం కానున్నాయి" అని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ఇంజినీరింగ్ కాలేజ్ ప్రారంభించి, తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల్లో కూడా మన ప్రాంత విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయని, ఇప్పుడు ప్రజల ఆలోచన కూడా మారుతోందని గొడవల కంటే విద్యపై దృష్టి పెడుతున్నారు" అని పేర్కొన్నారు. అంతకుముందు ఈద్గా ముఖద్వారాన్ని పరిశీలించి, తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, నగర కార్పొరేటర్లు షబ్బీర్, అవేజ్, ఉమర్ కొత్వాల్, అహె లే హద్దీస్ ఈద్గా సభ్యులు సైఫోద్దీన్, ఇసా అమోధి, జాబీర్ బిన్ సయ్యద్, నయీం సిద్దీఖి, సలీం స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

## ఏటీఎంనే ఎత్తుకెళ్లారు..

**మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఘటన**

**క్లూస్ టీమ్‌తో విచారణ చేపట్టిన పోలీసు బృందాలు**

**మహబూబ్‌నగర్ క్రైమ్, మే 26 ప్రభాతవార్త :** దుండగులు ఏటీఎంనే ఎత్తుకెళ్లిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద సోమవారం అర్ధరాత్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను ధ్వంసం చేసి గుర్తుతెలియని దుండగులు మెషిన్‌ను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేయడంతో ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం తో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టణం నడిబొడ్డున ఏటీఎం సెంటర్ ను సిసి కెమెరాలను ధ్వంసం చేసి ఏకంగా మెషిన్ నే ఎత్తుకుపోవడం మరింత చర్చనీయాంశంగా మారింది. షాద్ నగర్ లో కూడా ఇటీవల ఇలాంటి ఘటన నమోదు అయిన నేపథ్యంలో మహబూబ్‌నగర్ లో కూడా వారే ఈ చోరీకి పాల్పడి ఉంటారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



విచారణ చేస్తున్న పోలీసులు

## ఈద్గాను సందర్శించిన ప్రభుత్వ విప్ యెన్నం

**మహబూబ్‌నగర్, మే26, ప్రభాతవార్త:** ఈనెల 28న బక్రీద్ పండుగను పురస్కరించుకుని న్యూగంజ్‌లోని రహమానియా ఈద్గాను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సందర్శకులకు కావాల్సిన అన్ని వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య సిబ్బంది, అంబులెన్సు, ఆక్సిజన్, తాగునీరు, చలువ పందిరి, ఏర్పాటు చేయాలని ప్రార్థనలు చేసుకునే వారికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు అవేజ్, ఉమర్ కొత్వాల్, నాయకులు అజ్మత్ అలి, ఈద్గా కమిటీ సభ్యులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈద్గాను సందర్శించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## డి.ఎల్.ఈ.డి పరీక్ష వాయిదా...

**28న బక్రీద్ సెలవు, ప్రిన్సిపల్ మేరాజ్ ఉల్లా ఖాన్**

**మహబూబ్‌నగర్, మే 26 ప్రభాతవార్త :** మే 28, 2026న జరగాల్సిన మొదటి సంవత్సరం డి.ఎల్.ఈడి, డి.పి.ఎస్.ఈ పేపర్3 పరీక్షలు బక్రీద్ (ఈద్‌ఉల్‌అజ్హా) సెలవు మార్పు కారణంగా జూన్ 1, 2026కు వాయిదా పడినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినన్ని మహబూబ్ నగర్ ప్రభుత్వ డీ.ఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మేరాజ్ ఉల్లా ఖాన్ ఓ ప్రకటనలు తెలిపారు. విద్యార్థులు పరీక్షల మార్పు తేదీలను గమనించాలని సూచించారు. వాయిదా పడ్డ పరీక్ష డి.ఎల్.ఈడి 1వ సంవత్సరం: పేపర్III (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)డి.పి.ఎస్.ఈ 1వ సంవత్సరం: పేపర్III (హెల్త్, న్యూట్రిషన్ కేర్ ఆఫ్ చిల్డ్రన్ వర్కింగ్ విత్ పేరెంట్స్ కమ్యూనిటీ) షెడ్యూల్ ని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 28వ తేదీని బక్రీద్ సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ప్రభుత్వం సెలవుల క్యాలెండర్‌లో బక్రీద్‌ను 27గా పేర్కొంది. అయితే, సెలవును గురువారానికి మార్చాలని వక్ఫ్ బోర్డు సీఈవో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం 28న సెలవు ప్రకటించింది.

## పేటలో ఘనంగా శ్రీ గజ్జలేశ్వరీదేవి బోనాల జాతర

**నారాయణపేట, మే 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో మంగళవారం శ్రీ గజ్జలేశ్వరీదేవి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం రోహిణి కార్తె మొదటి రోజు నిర్వహించే అమ్మవారి ఉత్సవాలు ఈసారి మరింత ఘనంగా జరిగాయి. గొడుగుగేరి నర్సింలు ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను వైభవోపేతంగా ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయానికి చేర్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. పూజారులు అమ్మవారికి పెద్దబోనం సమర్పించగా, అనంతరం మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారికి కోళ్లు, మేకలు బలిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మయూరి పార్క్‌లో ప్లాస్టిక్ నిషేధం

**జూన్ 1 నుంచి అమలు డిఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్ వెల్లడి**

**మహబూబ్ నగర్, మే 26, ప్రభాతవార్త:** జూన్ 1 నుంచి మయూరి పార్క్‌లో ప్లాస్టిక్ నిషేధం ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, పార్క్ పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని, మయూరి పార్క్ లో 01062026 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు డిఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్క్‌లోకి ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు, ఇతర ప్లాస్టిక్ పదార్థాలు తీసుకురావడం అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. సందర్శకులు పర్యావరణహిత వస్తువులు మాత్రమే ఉపయోగించాలని కోరారు. వన్యప్రాణులు, పక్షులు, పార్క్‌లోని సహజ వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే హానిని తగ్గించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని, అందరు సందర్శకులు, పర్యాటకులు ప్రజలు ఈ నియమాలను పాటించి అటవీ శాఖకు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

**జడ్చర్ల, మే 26 ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అంబేద్కర్ నగర్ జిల్లా భరత్ విహార్ గ్రామానికి చెందిన రమేష్ కుమార్ యాదవ్ వయస్సు (50) మతిస్థిమితం లేక రెండు నెలల క్రితం ఉత్తంప్రదేశ్ నుండి ట్రైన్‌లో జడ్చర్లకు చేరుకున్నాడు. రోజువారి వాకింగ్ లో భాగంగా తమకు కనిపించడంతో బురెడ్డిపల్లి రోడ్ అబ్దుల్ కలాం కాలనిలో ఎస్బిహెచ్ లో గన్ మేన్ గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇంట్లో ఉంచి ప్రతి రోజు అతనికి భోజనం పెట్టి ఆశ్రయం కల్పించారు. అతను కోలుకున్నాక అతని వద్ద ఉన్న కీ చైన్ మీద ఉన్న షాప్ యజమానికి ఫోన్ చేయగా అతడు వారి కుమారులకు చెప్పడంతో ఆచూకీ సులభమైంది. మంగళవారం జడ్చర్లకు రావడంతో జడ్పి మాజీ వైస్ చైర్మన్ కోడగల్ యాదయ్య, రమేష్ యాదవ్ ను అప్పగించారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు వారిని అభినందించారు.



తప్పిపోయిన వ్యక్తిని అప్పగిస్తున్న దృశ్యం

# ఆదేశాలు ఇచ్చిన ఆగని చౌదూర్ క్రషర్ బ్లాస్టింగులు

**భయాందోళనలో గ్రామస్తులు**

**చౌదూర్ క్రషర్ ఆపాలని గ్రామస్తుల నిరసన**

**నవాబుపేట, మే 26 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండల పరిధిలోని చౌదూరు గ్రామ పరిధిలో వెలసిన క్రషర్ వెంటనే నిలిపేయాలని శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టి క్రషర్ యజమానికి పంచాయతీ సెక్రెటరీ గ్రామస్తులు సర్పంచ్ నోటీసులు జారీ చేశారు. ఆదేశాలిచ్చిన క్రషర్ పనులు ఆపకుండా భారీ శబ్దాలతో బ్లాస్టింగ్‌లు చేపట్టడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నవాబుపేట్ కొందూరు మెయిన్ రోడ్డు రహదారి పక్కనే ఉన్న క్రషర్ ఈ ప్రాంతంలో మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలనే నిబంధనలు ఉన్నాయి. కోర్టు పనులు జరగకుండా ఆదేశాలు ఇచ్చినా కోర్టు ఆదేశాలను ధిక్కరించి భారీ బ్లాస్టింగులు నిర్వహిస్తూ ప్రజల జీవనోపాధిపై క్రషర్ మిషన్ దెబ్బ కొడుతుందని గ్రామస్తులు రైతులు వాపోతున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని కొలిచే యంత్రాలను ఏర్పాటు చేసి, దుమ్ము దూళి రాకుండా ఎప్పుడు నీటిని వెదజల్లేలా దుమ్ము గాలిలోకి లేవకుండా క్రషర్ ప్రత్యేక ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ నవాబుపేట మండలంలో కొంతమంది క్రషర్ నిర్వాహకులు నిబంధనలను గాలికి వదిలేసి అక్రమంగా బ్లాస్టింగ్ లు చేయడం వల్ల చౌదూరు గ్రామం చుట్టుపక్క గ్రామాలలో దుమ్ము ధూళి అవహించటం వలన ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారనీ చౌదూరు గ్రామ ప్రజలు చుట్టూ ఉన్న భూముల రైతులు గ్రామస్తులు ఆందోళన చేపట్టి శుక్రవారం పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ కు నిరసనలు చేపట్టడంతో క్రెసర్ యజమానులకు అనుమతులు లేకుండా నడుస్తున్న క్రషర్ను ఆపాలని నోటీసులు జారీ చేశారు.



క్రషర్ మిషన్ నడుపుతున్న యాజమాన్యం

**పంట పొలాలకు నష్టం....**

చుట్టుపక్కల ఉన్న పొలాలు కూడా పంటలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను పట్టించుకోకుండా నిర్వహిస్తున్న క్రషర్లను వెంటనే సీజ్ చేసి ప్రభుత్వ సంపదను రావాల్సిన కోట్లరూపాయల సంపదను ఆవిరి చేస్తున్నారని వాపోతున్నారు. క్రషర్ యజమానులపై చర్యలు తీసుకోండిమండలంలోని చౌదూరు గ్రామపంచాయతీ పరిధిలోని క్రషర్‌లో భారీగా బ్లాస్టింగ్ జరుగుతు న్నాయని తాము దుమ్ము దూలికి అక్కడ ఉండలేక పోతున్నామని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆరోపిస్తూన్నారు. బ్లాస్టింగ్ జరిగిన ప్రతిసారి గ్రామంలోని అన్ని నివాస గృహాలు కాలుష్యంతో దుమ్ము, ధూళితో నిండిపోవడమే కాకుండా, పెద్ద శబ్దం రావడంతో, ఇండ్లు కదిలి శిథిలా వ్యవస్థకు చేరుకుంటున్నాయన్నారు. కష్టాలతో ప్రజలంతా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత క్రషర్ యజమానుల పైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తమను, తమ గ్రామాన్ని రక్షి ంచాలని కోరుకుంటున్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

**ప్రభుత్వ నిబంధనలు ఇలా.....?**

స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయడానికి మరియు నడపడానికి ప్రభుత్వం నుండి నిర్దిష్ట అనుమతులు తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూగర్భ ధనులు, కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక సంస్థల అనుమతులు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్, ఇతర విభాగాలు భూముల కేటాయింపు, ఇతర పరిశ్రమల భద్రత నిబంధనలు ప్రకారం అదనపు అనుమతులు అవసరమవుతాయి. అనుమతులు లేకుండా క్రషర్లు నడపడం చట్టరీత్యా నేరం. క్రషర్ విషయంలో హైకోర్టులో కేసు నడుస్తున్న క్రషర్ అనుమతులు లేకున్నా పనులు మాత్రం బ్లాస్టింగులు క్రషర్ పనులు నడుపుతూ ప్రజల పంట పొలాలపై దుమ్ము ధూళి పేరి కాలుష్యంతో నిండిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమంగా అనుమతులు లేని క్వారీలపై చర్యలు తీసుకొని తమ గ్రామాన్ని ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు.

# మక్తల్ సంత రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

**రోడ్డుకు ఇరువైపులా వాహనాలతో నిండిపోయి**

**పాదచారులు నడవడానికి కూడా స్థలం లేని దుస్థితి**

**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు**

**మక్తల్ టౌన్, మే 26 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఆదివారం అంగడి ఉండటంతో సంతబజారు మెయిన్ రోడ్డు, మార్కెట్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 8 వరకు వాహనాలు కిక్కిరిసిపోయి నడవడానికి కూడా స్థలం లేకుండా పోతోంది. సొంత బజారు రోడ్డు ఇరువైపులా షాపుల ముందు వందలాది బైక్‌లు, స్కూటర్లు, ఆటోలు, కార్లు ఇష్టానుసారం పార్క్ చేస్తున్నారు. రోడ్డు పై ఏదైనా ఒక వాహనాన్ని దుకాణదారులు అన్లోడ్ కొరకు నిలిపివేయడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుంది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు వాహనాల మధ్య నుంచి తప్పించుకుంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. ఈ దారిలో అంబులెన్స్ వస్తే కూడా దారి ఇచ్చే పరిస్థితి అసలే లేదు. గతంలో గుండెపోటు రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్ 15 నిమిషాలు ఇక్కడే నిలిచిపోయిందని షాపుల యజమానులు తెలియజేస్తున్నారు. చిన్న పిల్లలని తీసుకెళ్లే తల్లిదండ్రులు పిల్లల చేయి పట్టుకుని రోడ్డు దాటడం యుద్ధం చేయడం లాంటిదే అని వాపోతున్నారు. షాపుల ముందు బైక్‌లు పెట్టేసి వెళ్లిపోగా కస్టమర్లు షాపులోకి రాలేకపోతున్నారు. చెబితే గొడవకు దిగుతున్నారు అని వస్త్ర దుకాణ యజమానులు వాపోతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు చిన్నచిన్న యాక్సిడెంట్లు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలో ప్రత్యేక పార్కింగ్ స్థలం ఒక్కటి కూడా లేదు. ఫుట్‌పాత్ ఆక్రమణ కారణంగా ఉన్న ఫుట్‌పాత్‌లను షాపుల వాళ్లు పూర్తిగా ఆక్రమించారు. తోపుడు బండ్లు, బోర్డులు రోడ్డుపైనే పెట్టడంతో పట్టణవాసులు ఇక్కట్లకు గురవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ లేదు వాహనదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు .తక్షణ ప్రణాళిక ఏర్పాటు చేస్తే తప్ప బస్టాండ్ నుంచి పాత పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసిన నామమాత్రం గానే ఉన్నాయి. అతిక్రమిస్తే రూ.500 జరిమానాతో బోర్డు లు వెలసినా నిబంధనలను వాహనదారులు బేఖాతరు చేస్తున్నారు. ఇదే దారిలో కోర్టు ఉన్నా ఎక్కడపడితే అక్కడ ఆపిన వాహనాలను అధికారులు నియంత్రించలేకపోతున్నారు. మున్సిపాలిటీ ట్రాఫిక్ పోలీస్‌శాఖ అధికారులు ఉమ్మడిగాస్పందించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే ట్రాఫిక్ నియంత్రణ కాదని పట్టణవాసులు కోరుతున్నారు. ఉన్న ఆక్రమణలు తొలగించి మళ్లీ పెడితే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తే తప్ప ట్రాఫిక్ నియంత్రణలోకి రాదని అభిప్రాయపడుతున్నారు. వెనుక ఉన్న 50 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని చదునుచేసి తాత్కాలిక పార్కింగ్‌గా మారుస్తామని ఇంతకుముందు అధికారులు తెలియచేసినా ఇప్పటివరకుఅమల్లోకి రాలేదు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల్లో మార్పు రాకపోతే సమస్య తీరదు. ప్రతి ఒక్కరూ పార్కింగ్ నియమాలు పాటించి ఫుట్‌పాత్‌లను పాదచారుల కోసం వదిలేయాలని ప్రజలు అంటున్నారు.



జాతీయ రహదారి 167పై బస్టాండ్ ముందు పార్కింగ్ లేక రోడ్డు పక్కనే నిలబడిన వాహనాలు

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

**ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం**

**మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల్ మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ లో త్రిబుల్ ఆర్ కేంద్రం ప్రారంభం**

**మహబూబ్‌నగర్, మే 26 ప్రభాతవార్త :** పర్యావరణాన్ని కాపాడుకుంటూ ప్లాస్టిక్ రహిత సమాజానిర్మానానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల్ మమతా శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చా రు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 చొరవతో నూతనంగా ఏర్పాటు చేసిన " ఆర్ ఆర్ ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీ సైకిల్ ) సెంటర్" మరియు "వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని" ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ గుమ్మల మమతా శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఎం.సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగరంలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ఈ ట్రిపుల్ ఆర్ సెంటర్ ఎంతో అవసరం అని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని పాత ప్లాస్టిక్ సీసాలు, పేపర్లు, కార్డ్‌బోర్డులు, ఇనుప వస్తువులను ఇక్కడ ఇచ్చి నిర్ణీత ధరల పట్టిక ప్రకారం నగదు పొందవచ్చని (బై బ్యాక్ స్కీం), అలాగే సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఇక్కడి వర్మీ కంపోస్ట్ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మన మహబూబ్ నగర్ నగరాన్ని మరింత స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.



త్రిబుల్ ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటి మేయర్

## విద్యుత్ సమస్యను పరిష్కరించండి

**ఏఈకి వినతి పత్రం అందజేత**

**జడ్చర్ల, మే 26 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సత్యనారాయణ స్వామి ఆలయం, టీచర్స్ కాలనీలో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాల మధ్య దూరం చాలా ఎక్కువగా ఉండడం వల్ల వీచే గాలులకు, వర్షాలకు తీగలు ఒక్కదానితో ఒక్కటి తగులుకొని ..స్పార్క్స్ వచ్చి మంటల చెలరేగలగుతున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై జడ్చర్ల పట్టణ విద్యుత్ ఏఈ ఎర్రన్నకు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కాలనీ లో సరిపడా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను తొలగించాలని కోరారు. వినతి పత్రం అందుజేసిన వారిలో సి. వెంకటయ్య, లక్ష్మయ్య, ఆంజనేయులు, చెన్నయ్య, మురళి, నాగరాజు ఉన్నారు.

## తలుపునూరులో యువజన సంఘాల ఏర్పాటుకు పిలుపు

**రేవల్లి, మే 26 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని తల్పునూర్ గ్రామంలో మేరా యువభారత్ ఆధ్వర్యంలో తలుపునూరు గ్రామంలో యువజన సంఘాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డిస్టిక్ యూత్ ఆఫీసర్ వీకోట నాయక్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, మద్యపాన నిషేధం, డ్రగ్స్ నివారణ, పోటీ పరీక్షల అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యూత్ క్లబ్స్‌కు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు.

## కంకర రోడ్డుపై స్కిడ్ అయిన ద్విచక్ర వాహనం.. వ్యక్తికి గాయాలు

**రేవల్లి, మే 26 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని తలపునూరు గ్రామానికి చెందిన వాహనంపై ఓవ్యక్తి మండల కేంద్రం నుంచి మాదాపూర్ వెళ్లే దారిలో కంకర రోడ్డుపై స్కిడ్ అయి కిందపడి గాయాల పాలయ్యాడు. ఆ వ్యక్తిని గమనించిన స్థానికులు 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు. చాలా రోజులుగా రోడ్డు పై కంకర పరిచి బీటీ రోడ్డు వెయ్యకపోవడంతోనే ఈ సంఘటన జరిగినట్లు వాహనదారులు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## వర్షాకాలంలో మళ్లీ ముప్పు తప్పేలా లేదా

# కల్వర్టుల నిర్మాణాలు చేపట్టరా..?

**నవాబుపేట, మే 26 ప్రభాతవార్త :** వర్షాకాలం సమీపిస్తుండటంతో వర్షం వచ్చిందంటే చాలు కల్వర్టులు దెబ్బతిని రాకపోకలు ఎక్కడ నిలిచిపోతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కూచూరు దొడ్డిపల్లి చిన్న చెరువు గతేడాది అలుగు వెళ్లిన సందర్భం ఊహించుకొని రాబో యే వర్షాకాలంలో కూడా భారీ వర్షాలు కురిస్తే ఎలా అని భయాం దోళనకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా నవాబుపేట మండ ల పరిధిలోని కూచూరు 2.కిష్టారం దొడ్డిపల్లి గ్రామాల మధ్య గల చిన్న చెరువు వెనుక గల కల్వర్టు దగ్గర, 3.దొడ్డిపల్లి గ్రామం సమీపంలో, 4.రుద్రారం గ్రామంలో, రుద్రారం కూచూర్ గ్రామాల మధ్య గల రాజమోని వంపు దగ్గర, 5.కూచూర్ దగ్గర గల ఆకులోని కుంట దగ్గ6.మల్లారెడ్డిపల్లి గ్రామం నుండి చెన్నారెడ్డిపల్లి మధ్య, 7.చెన్నారెడ్డిపల్లి గ్రామం దగ్గర లెంకల చెరువు అలుగు, 8.చెన్నారెడ్డిపల్లి రుక్కంపల్లి గ్రామాల మధ్య కల్వర్టులు9.కారూరు గ్రామం నుండి ఇప్పటూరు గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు దగ్గర, 10.కారూర్ గ్రామం ఆంజనేయస్వామి దేవాలయం ముందు రోడ్డుపై చెరువు అలుగునీరు, ఇలా మండల వ్యాప్తంగా కల్వర్టులు నిర్మించాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే భయం గుప్పిట్లో చుట్టుపక్కల గ్రామాల కల్వర్టులు ఎప్పుడు నిర్మిస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూచూర్, దొడ్డిపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దాదాపు పది గ్రామాల ప్రజలు అటు జడ్చర్లకు ఇటు నవాబుపేటకు మధ్యలో గల గ్రామాల యువకులు పోలేపల్లి కంపెనీ లలో ఉపాధి పొందుతూ రైతులు వారు పండించిన పంటలు కూర గాయలు ఎగుమతి చేయడానికి రోజు కొన్ని వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. గత ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు అల ంగుపారి రోడ్డు కల్వర్టు మొత్తం ధ్వంసం అయి రాకపోకలకు వారం రోజులపాటు ఆటంకం కలిగింది. ఆ వరద ఉధృతిలో ముగ్గురు పట్టు తప్పి వరద ఉధృతి లో కొట్టుకుపోయి చనిపోయిన రోజులు కూడా ఉన్నాయి. భారీ వర్షాల వరద ఉధృతికి రోడ్లు మొత్తం పూర్తిగా కొట్టుకు పోయాయి. అయితే అవి నేటికి కూడా అధికారులు గానీ నాయకులు గానీ చెరువు అలుగు కల్వర్టు కోసం ప్రతిపాదనలు అందించడం లేదని అధికారులు గ్రహించడం లేదని అటువైపు చూడటం లేదని పాపోతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా కల్వర్టుల నిర్మాణానికి నోచుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్తే త్వరితగతిన ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవ చూపుతాడని వెంటనే సమస్యలు కల్వర్టులు పరిష్కారం అవుతాయని ప్రజలు నాయకుల మాటల్లో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





గతేడాది వర్షాకాలంలో వచ్చిన వరదలు, ఇబ్బంది పడ్డ ప్రజలు (ఫైల్)

## ఎన్యుమనేటర్‌పై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలి

**పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్**

**జడ్చర్ల, మే 26, ప్రభాతవార్త:** గండీడ్ గ్రామపంచాయతీలో సెన్సస్ 2026,27 గృహ గణన విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయుడు డి. సంజీవ్ రెడ్డి పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొప్పుల గోపాల్ అనే వ్యక్తి అకారణంగా దుర్భాషలాడుతూ కర్రతో దాడి చేసి గాయపరి చారని ఇలా విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయుడిపై దాడి చేయడం సరికాదని మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సెన్సస్ 2027 గృహ గణన విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

